క్లుప్తంగా

జయ జయహో జగన్నాథ్



భీమిలిలో జగన్నాథ స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

భీమునిపట్నం : భీమిలిలో ఆదివారం జగన్నాథ స్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. తొలుత మెయిన్‌రోడ్డులో రథంపై ఉంచిన ఉత్సవ విగ్రహాలకు అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. మెయిన్ రోడ్డుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు నిర్వహించారు. అలాగే సోమవారం నుంచి పది రోజులపాటు స్వామి వారి దశావతారాల్లో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పిస్తామని అర్చకులు తెలిపారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఉత్సవాల నిర్వహణకు కమిటీ ఏర్పాటు



ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో త్వరలో నిర్వహించే శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు పలువురు పెద్దలతో ఆదివారం కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షునిగా కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి, అధ్యక్షునిగా గాడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా మైలిపల్లి లక్ష్మణరావు, కోశాధికారిగా బొండా బాలాజీతోపాటు ఇతర ముఖ్య సభ్యులను నియమించారు. ఉత్సవాల నిర్వహణ వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని, ఎంతో ఘనంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

500 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస : ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో ఆదివారం ఉమా నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్ధమాన సినీ దర్శకుడు బమ్మిడి శ్రీతారక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరంలో 500 మందికి సేవలు అందించారు. ఆయన తల్లిదండ్రులు ఉమాదేవి, సూర్యనారాయణ పేరిట నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. వైద్యులు గుండె, కాలేయం, కిడ్నీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో పెట్రో విశ్వవిద్యాలయం మాజీ చైర్మన్ వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఆనందపురం సీఐ తిరుపతి రావు, కంటుబోతు రామానాయుడు, చిక్కాల విజయ్, కోరాడ రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో ఆక్రమణల జోరు

- శ్రీలక్ష్మీనగర్ నుంచి ఇతర ప్రాంతాలకు వ్యాప్తి
- ముత్యాలమ్మ కాలనీ, శారదానగర్, వికలాంగుల కాలనీల్లోనూ ఆక్రమణలు
- అధికార పార్టీ నేతల అండతోనే దందా
- మొద్దునిద్ర నటిస్తున్న రెవెన్యూ అధికారులు
- అధికార పార్టీ అనుమతి లేనిదే ఆఫీసు నుంచి కదలని వైనం



ఉడా కాలనీ - ఐటీ సెజ్ మాస్టర్ ప్లాన్ రహదారిని ఆనుకుని వికలాంగుల కాలనీ వద్ద గెడ్డను కప్పేసి ఏర్పాటు చేసిన రోడ్డు



ముత్యాలమ్మ కాలనీలో కొండను తొలిచి నిర్మాణానికి ఏర్పాట్లు



శారదానగర్ కొండపై ఆర్‌జీకే కాలనీని ఆనుకుని అక్రమ నిర్మాణాలు

మధురవాడ : ప్రభుత్వ భూమిలో ఆక్రమణల దందా విశాఖ రూరల్ మండలం మధురవాడ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా విస్తరిస్తోంది. ఆక్రమణదారులు కొండలు, పార్కులతోపాటు గెడ్డలను కూడా వదలడం లేదు. కొద్ది రోజుల క్రితం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 27లోని శివశక్తినగర్ రోడ్డులోని ముత్యాలమ్మ కాలనీలో 25కుపైగా షెడ్లు అక్రమంగా నిర్మించేశారు. ఇక్కడి అక్రమ నిర్మాణాలు అడ్డుకునేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను కూడా అక్రమార్కులు తీసేసి పక్కన పడేశారు. దీనిపై గ్రేడ్ – 2 వీఆర్‌వో పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నప్పటికీ తర్వాత ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. ఇక్కడి ప్రభుత్వ భూమి పరిరక్షణకు రెవెన్యూ అధికారులు పోలీసుల రక్షణతో పొక్లెయిన్ తీసుకొచ్చినప్పటికీ అధికార టీడీపీ నేతల ఒత్తిడికి లొంగిపోయి వెనక్కి వెళ్లిపోయారు.

ఆగని ఆక్రమణల పర్వం

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో రెవెన్యూ అధికారులు మొద్దు నిద్ర నటిస్తుండడంతో ఆక్రమణల పర్వం ఇతర ప్రాంతాలకు శరవేగంగా వ్యాప్తి చెందుతోంది.

- తాజాగా పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 179లో మారికవలస ఆర్‌జీకే కాలనీని ఆనుకుని పిల్లర్స్ వేసి మరీ శాశ్వత పద్ధతిలో నిర్మాణం చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో కొద్ది రోజులుగా ఆరు చోట్ల అక్రమ నిర్మాణాలు జోరుగా చేపడుతున్నారు.
- మధురవాడ రెవెన్యూ గ్రామం జీవీఎంసీ 8వ వార్డు వికలాంగుల కాలనీలో కూడా టీడీపీ నాయకుల అండతో కొద్ది రోజులుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పటికే ఐదుకు పైగా నిర్మాణాలు చకచకా సాగిపోతున్నాయి.
- మిథిలాపురి ఉడా కాలనీ – ఐటీ సెజ్ మాస్టర్ ప్లాన్ రోడ్డును ఆనుకుని మధురవాడ వికలాంగుల కాలనీకి ఎదురుగా ఉన్న భారీ గెడ్డను కొద్ది రోజులుగా అక్రమార్కులు కప్పేస్తున్నారు. ఇక్కడ చెరువు స్థలంలో నుంచి రోడ్డు కూడా నిర్మించేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వం క్రమబద్ధీకరించేస్తుందని...

మరో విషయం ఏమిటంటే ఉడా కాలనీ వద్ద ఉన్న వికలాంగుల కాలనీ, మారికవలస జంక్షన్‌ని ఆనుకుని శారదానగర్, ముత్యాలమ్మ కాలనీతో పాటు అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు గతంలో ఆక్రమించుకున్నారు. వాటిని 2014 నాటికి ప్రభుత్వ భూముల్లో స్థిర నివాసం ఏర్పచుకున్న వారి ఇళ్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. మళ్లీ అలానే ప్రభుత్వాలు క్రమబద్ధీకరించేస్తాయని కొందరు అక్రమార్కులు నిర్మాణాలు చేస్తుండడం గమనార్హం. అధికార పార్టీ అండ ఉంటే 'తమ్మిని బమ్మి' చేయగలమని అక్రమార్కులు నిరూపిస్తున్నారు.

గ్రేడ్ – 2 వీఆర్‌వోలు ఏం చేస్తున్నారో..?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడక ముందు మధురవాడలో లక్ష జనాభాకి ఇద్దరు వీఆర్‌వోలు మాత్రమే ఉండే వారు. గత ప్రభుత్వం వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాత 1000 నివాసాలకు ఒక్క గ్రేడ్ – 2 వీఆర్‌వోతోపాటు ఇతర సచివాలయ కార్యదర్శులు వచ్చారు. ఆయా నివాసాల పరిధిలో చీమ చిటుక్కుమంటే తెలిసి పోయే పరిస్థితిని గత ప్రభుత్వం కల్పించింది. అయినప్పటికీ కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఇష్టారాజ్యంగా ఆక్రమించేస్తున్నా గ్రేడ్ – 2 వీఆర్‌వోలు ఏం చేస్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. క్షేత్ర స్థాయిలో ఆక్రమణదారులతో వీరు కుమ్ముక్కవుతున్నారా..? లేక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు భయపడి మొద్దు నిద్ర నటిస్తున్నారా..? అన్నది అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ... అధికార టీడీపీ నాయకుల అనుమతి లేనిదే ఆఫీసు నుంచి పరిశీలనకు రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ముత్యాలమ్మ కాలనీలో అక్రమంగా నిర్మించిన ఇల్లు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న మహేష్, తదితరులు

పద్మనాభం : పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో బీజేపీ మండల యువ మోర్చా అధ్యక్షుడు హంస.మహేష్, విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పద్మనాభం వైస్ సర్పంచ్ కాళ్ల అప్పలరాజు, మాజీ ఉప సర్పంచ్ కాళ్ల శివ, బుగత పెద్ద రమణ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేసున్న కమిటీ సభ్యులు

పద్మనాభం : మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాం పురం కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. పెంట, కొవ్వాడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. భగవద్గీత విశిష్టతను ప్రజలకు తెలియజేశారు. ప్రచారంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.భవానీ, కె.సంతోషి లక్ష్మి, ఎస్.అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత మూలకుద్దు



ట్రోఫీతో మూలకుద్దు క్రికెట్ జట్టు సభ్యులు

తగరపువలస : చిట్టివలసలో నెల రోజులుగా గొడ్ల చిరంజీవి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా భీమిలి మండలం మూలకుద్దు జట్టు రూ.20 వేల నగదు బహుమతి, ట్రోఫీ గెలుచుకుంది. రన్నర్‌గా కొండపేట జట్టు రూ.10 వేల నగదు బహుమతి, ట్రోఫీ గెలుచుకున్నారు. వీరికి భీమసేన రాష్ట్ర అధ్యక్షుడు రవి సిద్ధార్థ, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దండి వెంకటేష్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివ, ఈశ్వర్, స్వామి, బాలాజీ, ముఖేష్, ధను, సంతపేట ఎస్సీ కాలనీ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

యువత రక్తదానం



రక్తదాన శిబిరంలో శ్రీఆంజనేయం మజిల్ ప్లానెట్ జిమ్ సభ్యులు

తగరపువలస : నగరంలో హెచ్‌బీ కాలనీలోని మజిల్ ప్లానెట్ జిమ్‌లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో తగరపువలసకు చెందిన 46 మంది యువకులు పాల్గొని సేవాస్ఫూర్తిని చాటారు. జిమ్ ప్రధాన కోచ్ బోర కోటిరెడ్డి పిలుపు మేరకు జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట, రెండో వార్డు బైపాస్‌రోడ్డుకు చెందిన శ్రీఆంజనేయం మజిల్ ప్లానెట్ జిమ్‌ల నుంచి యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విజ్ఞపు సంతోష్‌కుమార్, వాసుపల్లి నరేంద్ర తదితరులు మాట్లాడుతూ రెడ్ గోల్డ్‌గా పేరుపొందిన రక్తం మరొకరి ప్రాణాలు కాపాడుతుందన్నారు. దీని కోసం ఎంతవరకైనా వెళ్లి ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

గోస్తనీ నదిలో ఆక్రమణలపై ఫిర్యాదుకు సిద్ధం



తగరపువలసలోని గోస్తనీనది ప్రాంతం



గోస్తనీనది ఒడ్డున గ్రామీణ నీటి సరఫరా విభాగం బోరుబావి ఉన్న ప్రాంతం

తగరపువలస : ఎట్టకేలకు గోస్తనీనది పరీవాహక ప్రాంతంలో ఆక్రమణలపై స్థానికులు సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు. ఇటీవల ఈ ప్రాంతంలో సుమారు రెండు ఎకరాల వరకు గోస్తనీనది ప్రాంతం కబ్జాకు గురైనట్లు గుర్తించారు. దీంతో తరచూ వరదల సమయంలో నదీ ప్రవాహం దిశ మారి గ్రామాల్లోకి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలువురి కబంధ హస్తాల్లో చిక్కి శల్యమైపోయిన నదీ ఆవరణ ప్రాంతంలో గతంలో రజకుల సౌకర్యార్థం దోబీఖానాలు ఉండేవన్నారు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో భీమిలి గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే బోరుబావులు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఉన్నాయన్నారు. జాతీయ రహదారుల సంస్థ నిర్మించిన వంతెనల పిల్లర్లు సైతం ఆక్రమించి వాటి మొదట్లో ఇసుక తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని, సమగ్ర సర్వే చేయించి గోస్తనీనది ప్రాంతాన్ని సహజ సిద్ధంగా ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని కోరనున్నట్టు ఫిర్యాదుదారులు తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పీఎంపాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. నగరంలోని శ్యామల కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుత నృత్యాలతో అలరించారు. గణపతి స్తుతి గీతానికి చేసిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా కళాకారులు దీక్షిత, స్నిగ్ధ ప్రమిదలో వెలిగించిన దీపాలు చేతబూని ఘటాలపై ప్రదర్శించిన నృత్యాభినయాలు కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచాయి. కళకారులు మోక్షిత, సత్యవర్షిణి, రిషిత, జోషిత, శృతి, శ్రీజ, సహస్ర, అంజని, సమన్వి, కుందన ప్రియ, విద్య, ప్రణతి, లాస్య, శ్రావణి, దీక్షిత, చాందిని తదితరులు చేసిన నృత్యాలకు శ్యామల దర్శకత్వం వహించారు.

వైఎస్సార్ జయంతికి ఏర్పాట్లు

మధురవాడ : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి కార్యక్రమాలు జీవీఎంసీ 7వ వార్డులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు చెప్పారు. ఉదయం 9 గంటలకు మధురవాడ డైలీ మార్కెట్, పీహెచ్‌సీ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. 10 గంటలకు చంద్రంపాలెం బాపూజీ కళా మందిరం వద్ద గల జాతీయ నేతల విగ్రహాలు వద్ద వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి, కేక్ కట్ చేస్తామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లోనూ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు చెప్పారు. ఉదయం పది గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి అన్ని గ్రామ పంచాయతీల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ ఎస్ఐగా పాపారావు



పాపారావు

తగరపువలస : ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐగా పి.పాపారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ బ్రాంచి నుంచి బదిలీపై వచ్చిన పాపారావు గతంలో పీఎం పాలెంతోపాటు ఎండాడ దిశ పోలీస్ స్టేషన్‌లో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవలస కూడలిలో పువ్వుల మార్కెట్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడటంతోపాటు మండలంలో ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీఆర్‌టీఎస్‌లో ఆటో బోల్తా

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో సంజయ్‌గాంధీ కాలనీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో బోల్తా పడింది.స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. హనుమంతవాక నుంచి ఆరిలోవ వైపు ఓ ఆటో మితిమీరిన వేగంతో వెళ్తూ సంజయ్‌గాంధీ కాలనీ వద్ద డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడి నుజ్జయింది. ఆటోకు ముందు, వెనక భాగాలు పూర్తిగా పాడయ్యాయి. ఆటోలో ఉన్న కొందరు యువకులు స్వల్ప గాయాలతో పరారయ్యారు. ఆటోలో కొందరు ఆకతాయిలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో దగ్గరలో వేరే వాహనాలు లేకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగలేదు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆటోను రోడ్డు పక్కకు తరలించి కేసు నమోదు చేశారు.

కదులుతున్న ఆక్రమణల డొంక



ఆక్రమణకు గురైన స్థలం

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట సర్వే నెంబర్ 314లోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల డొంక కదులుతోంది. గత రెండు రోజుల నుంచి రెవెన్యూ అధికారులు ఈ కొండపై అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న నేపథ్యంలో ఆక్రమణల సంఖ్య పెరుగుతోంది. ఏడు ప్లాట్లు అక్రమమని అధికారులు తెలిపారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో 2004లో 312 పట్టాలను మాత్రమే అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఇప్పుడు 20 సంవత్సరాల తర్వాత పట్టాలు ఉన్నాయంటూ చాలా మంది నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో రీ సర్వే నిర్వహించి 2004లో ఇచ్చిన పట్టాల సంఖ్య, ప్రస్తుత ఈ ప్రాంత నిర్మాణాల సంఖ్యతో పరిశీలిస్తే మరెన్నో ఆక్రమణలు బయట పడతాయని పలువురు సీనియర్ సిటిజన్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తే ఆక్రమణల చిట్టా బయటపడుతుందని స్థానికులంటున్నారు.

ఏయూ మెస్‌ల ఆకస్మిక తనిఖీ



మెస్‌లో పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కిషోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల మెస్‌లను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కళాశాల, రీసెర్చ్ స్కాలర్స్, మహారాణిపేటలోని విద్యార్థినుల మెస్‌లను పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత, ఆహార పదార్థాల రుచి, నాణ్యత వంటివి ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెస్‌లలో సిబ్బంది ప్రవర్తన, పని తీరు, భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మెస్‌లలో పలు మార్పులు చేయాలని కోరారు. వాటికి త్వరలో పరిష్కారం చూపుతామని రిజిస్ట్రార్ హామీ ఇచ్చారు. తరచూ మెస్‌లను తనిఖీ చేస్తామని, నాణ్యతలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. మెస్‌లలో పని చేస్తున్న సిబ్బందితో నేరుగా మాట్లాడారు. రుచిగా, శుచిగా భోజనం అందించడానికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్‌లు బి.మునిస్వామి, కె.రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. అప్పన్నను దర్శించుకోవడానికి భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. మరో వైపు సింహాచలేశుడికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయకల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పట/ స్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈఓశక్ష ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.